వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్



రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

- లోఓల్టేజీ సమస్య లేకుండా చర్యలు
- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- 67 మంది రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

అడ్డాకుల: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం జానంపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్ మండలాలకు చెందిన 67 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో లోఓల్టేజీ సమస్యతో పంటలు ఎండిపోయాయని.. సమస్య పరిష్కారం కోసం తాము ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లోఓల్టేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు 18 నెలల కాలంలోనే ఎనిమిది సబ్‌స్టేషన్లు మంజూరు చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో జడ్చర్ల సబ్ డివిజన్ పరిధిలో కేవలం మూడు కొత్త సబ్ స్టేషన్లను మంజూరు చేయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం అంతకు రెట్టింపు సబ్‌స్టేషన్లు మంజూరు చేయించి రైతు పక్షపాతిగా రుజువు చేసుకుందన్నారు. మూసాపేట మండలంలో రూ. 30కోట్లతో 133కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి త్వరలోనే డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ చేతులమీదుగా శంకుస్థాపన చేయిస్తామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు సెంటర్ మంజూరు, 11కేవీ విద్యుత్ లైన్ల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్ మండలాల్లో గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు రూ. 5.02కోట్ల కరెంటు బిల్లులను ప్రభుత్వం చెల్లించినట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉన్నా.. సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్క హామీని నెరవేరుస్తున్నారన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పిచ్చికూతలు కూస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం తిమ్మాపూర్‌లో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, నాగిరెడ్డి, జగదీశ్వర్, విజయమోహన్‌రెడ్డి, గోవర్ధన్, కృష్ణయ్య, ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్, డీఈ చంద్రమౌళి, ఏడీఈ చంద్రశేఖర్, ఏఈలు కిరణ్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



కనకాపూర్ తండాలో భూ సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిర బోయి

- భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ విజయేందిర బోయి

అడ్డాకుల: భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మూసాపేట మండలం కనకాపూర్ తండాలో మంగళవారం జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో మాట్లాడి భూ సమస్యలను తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భూ సమస్యలపై ఎవరూ తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలకు తిరగవద్దని అధికారులే గ్రామాలకు వస్తున్నారని.. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూ భారతి చట్టం ద్వారా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, మూసాపేట మండలాన్ని భూ భారతి చట్టం అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినందుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్ ఆధ్వర్యంలో కలెక్టర్ విజయేందిర సమక్షంలో రెవెన్యూ అధికారులను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కనకాపూర్ తండాలో 31, సంకలమద్ది గ్రామంలో 10 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు.

మరో అవకాశం..

భూ భారతి చట్టం అమలుకు మూసాపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా.. అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను పూర్తి చేసినట్లు తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు. అయితే ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఎవరైనా భూ సమస్యలపై దరఖాస్తులు అందజేయని వారి కోసం మరో అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వారు బుధవారం భూ సమస్యలపై మూసాపేట తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మదన్మోహన్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీయూ కంట్రోలర్‌కు సన్మానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రవీణను మంగళవారం పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు పలు సమస్యలను కంట్రోలర్ దృష్టికి తీసుకెళ్లారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు సకాలంలో ప్రాక్టికల్స్, పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఆలస్యం జరిగితే విద్యార్థులు సెట్ పరీక్షలకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. బీఈడీ పరీక్ష ఫలితాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పీయూ అధ్యక్షుడు రాము, కార్యదర్శి రాకేష్, విద్యులత, స్వప్న, విజయ, మశ్చేందర్, బుగ్గప్ప, ప్రశాంత్, వినయ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



దేవరకద్ర: మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఎస్ఐ అక్షయ్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా పెండింగ్ ఈ–చలానాలు వసూలు చేశారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



చిన్నచింతకుంట: మండలంలోని పెద్ద వడ్డేమాన్ గ్రామ సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్ద వడ్డేమాన్‌కు చెందిన ఆంజనేయులు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో డంపు చేసిన ఇసుకను టిప్పర్‌లో తరలించే ప్రయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెలిమిల బాలకిష్టారెడ్డి, శివాజీ, నాగరాజు, జాకీర్, వాజీద్, ఆటో శేఖర్‌తో పాటు మరికొందరు అక్కడికి చేరుకొని ఇసుక రవాణాను అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించగా.. వారు అక్కడికి చేరుకొని ఇసుక తరలింపునకు వినియోగించిన జేసీబీ, టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. ఆంజనేయులుపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ రాంలాల్‌నాయక్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వార్షిక పూజలు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని కావేరమ్మపేట, జడ్చర్లలో మంగళవారం బొడ్రాయి వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కావేరమ్మపేట సర్కిల్‌లో ప్రతిష్ఠించిన బొడ్రాయికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు మహిళలు బోనాలతో వచ్చి ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బుక్క మహేశ్ పాల్గొన్నారు. అదే విధంగా జడ్చర్ల జెడ్పీ హైస్కూల్ సమీపంలో ఉన్న బొడ్రాయికి వార్షిక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ గురుస్వామి కథనం ప్రకారం.. పెద్దకొత్తపల్లికి చెందిన రాజు ఆటోలో తన భార్యాపిల్లలతో కలిసి ఈ నెల 10న మండలంలోని గుంతకోడూరుకు వస్తుండగా.. తాడూరు సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో రాజు భార్య చెన్నమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. చెన్నమ్మ తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గురుకుల భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలి



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీ గురుకుల భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి ఆయన స్థానిక బోయపల్లిలో నిర్మిస్తున్న మైనార్టీ గురుకుల భవనం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్ బిల్లులు చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. త్వరలో నూతన భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మైనార్టీ విద్యార్థులకు అన్ని వసతులతో మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, అసిస్టెంట్ డైరెక్టర్ చాంద్‌పాషా, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించం



రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేశ్

భూత్పూర్: రైతులకు నకిలీ విత్తనాలు అంటగడితే సహించమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్ అన్నారు. మంగళవారం భూత్పూర్‌లోని తెలంగాణ రిసెర్చ్ సీడ్స్ పెస్టిసైడ్స్ దుకాణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని సూచించారు. నాసిరకం విత్తనాలతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంతో పాటు పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అదే విధంగా రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని డీఏఓ సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ కోసం పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ఎంఈఓలకు అందించాలని తెలిపారు. డీఏఓ వెంట ఏఓ మురళీధర్, ఏఈఓ ప్రసాద్‌బాబు తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేస్తున్న ఇప్పటూర్ గ్రామస్తులు

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదన్నారు. రోజు వ్యవసాయ బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. గ్రామంలో చాలా రోజులుగా తాగునీటి సమస్య నెలకొన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయంపై పంచాయతీ అధికారిని వివరణ కోరగా.. తాగునీటి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం



దేవరకద్రలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



కోయిల్‌కొండలో పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

కోయిల్‌కొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. మంగళవారం కోయిల్‌కొండలో ఈ నెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. దేశవ్యాప్త సమ్మెతో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ తిరుమలయ్య, నరేష్, రాము, రామకృష్ణ, రవి, శ్రీనివాసులు, వడెన్న, లక్ష్మయ్య, హన్మంతు, వెంకటేశ్ పాల్గొన్నారు.

దేవరకద్రలో బైక్ ర్యాలీ..

దేవరకద్ర: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో దేవరకద్రలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ పిలుపునిచ్చారు.

విజయవంతం చేయండి..

మిడ్జిల్: దేశవ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేత రాములు కోరారు. మిడ్జిల్‌లోని అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ.. కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, మధు, నారన్‌రెడ్డి, బాలస్వామి, నర్మద, విక్టోరియా, సురేందర్‌గౌడ్ ఉన్నారు.

జెడ్పీ సీఈఓ విచారణ



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఎదుట చేపట్టిన నిర్మాణంపై మంగళవారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి విచారణ జరిపారు. 167 నంబర్ జాతీయ రహదారి పక్కన చేపట్టిన నిర్మాణానికి సంబంధించి వాహెద్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుకు స్పందించి మున్సిపాలిటీ నుంచి నిర్మాణదారుడు మోజెస్‌కు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే సదరు నిర్మాణదారు ఇటీవల అదనపు కలెక్టర్‌ను కలిసి వివరాలు వెల్లడించగా.. సమగ్ర విచారణకు జెడ్పీ సీఈఓను ఆయన ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ విచారణ చేపట్టారు. మొదట ఇరువురి అభిప్రాయాలను తెలుసుకున్న ఆయన.. ఫీల్డ్ విజిట్ చేశారు. 167వ నంబరు జాతీయ రహదారి విస్తరణలో తాము ఇళ్లు కోల్పోయినా ఎలాంటి పరిహారం అందలేదని బాధితులు ఆయనకు వివరించారు. మిగిలిన 60 అడుగుల జాగాలో నిర్మాణం చేసుకున్నామని తెలియజేశారు. ఫ్లైఓవర్ నుంచి ఎంబీ చర్చి వరకు ఇదే పద్ధతిలో ఇళ్లు కోల్పోయిన వారు మిగిలిన కొద్దిపాటి స్థలంలోనే నిర్మాణాలు చేసుకున్నారని స్థానికులు తెలిపారు. తమపై ఫిర్యాదు చేసిన వ్యక్తికి, తమకు ఎలాంటి సంబంధం లేదని జెడ్పీ సీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంబీ చర్చి సమీపంలో అనుమతి లేకుండా నిర్మించిన సెల్లార్ భవనాన్ని ఆయన పరిశీలించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి ఉన్నారు.

ఉమ్మడి జిల్లా ఆల్‌మేవా ఇన్‌చార్జీగా రషీద్



స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీగా మహ్మద్ అబ్దుల్ రషీద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఫారుఖ్ హుస్సేన్, సయ్యద్ అబ్దుల్ వహీద్‌షా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నియామకం మూడేళ్లు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో సంఘం సభ్యత్వ నమోదు పూర్తిస్థాయిలో చేయాలని కోరారు.

రాజ్యాంగబద్ధ హక్కులకు రక్షణ కరువు



మాట్లాడుతున్న మాణిక్యంరాజు

మహబూబ్‌నగర్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులకు రక్షణ కరువైందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యం రాజు, కార్యదర్శి కుర్మయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. స్వాతంత్ర్యం కంటే ముందు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దుచేసి.. నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి అన్యాయం చేస్తుందన్నారు. రాజ్యాంగబద్ధంగా ఆర్టికల్–19 ప్రకారం సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, కనీస వేతనం పొందే హక్కుల నుంచి కార్మికులను దూరం చేయడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన ప్రభుత్వం.. రాజ్యాంగేతర శక్తిగా పనిచేస్తుందని ధ్వజమెత్తారు. ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు కంచిమి లక్ష్మణ్, సింగిరెడ్డి పరమేశ్వర్, సామెల్, రమేష్, గోపాల్, రాము, వెంకట్రాములు, ఆది విష్ణువర్ధన్, మనోహర్, రాజు, సుందర్ పాల్గొన్నారు.

బీవీపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న భూషణ్ పాండే

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పాలమూరుశాఖ అధ్యక్షుడు భూషణ్ పాండే అన్నారు. స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని షిర్డీసాయి ఆలయంలో మంగళవారం నిర్వహించిన బీవీపీ పాలమూరుశాఖ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో బీవీపీ తనవంతు భాగస్వామ్యం అవుతుందన్నారు. బీవీపీ పాలమూరుశాఖ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు అందించడం, రక్తదాన శిబిరాల నిర్వహణ, ఎస్ఎస్సీ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని బీవీపీ ప్రాంత సలహాదారు ప్రతిపాదించినట్లు తెలిపారు. సమావేశంలో చంద్రుడు, ప్రసాద్, వెంకటేశ్వరరావు, రాంచందర్, బస్వరాజు, సురేష్ చందర్ దూత్, సత్యనారాయణ, రాంరెడ్డి, సహదేవ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం



శేఖర్

మిడ్జిల్: మండలంలోని దోనూర్ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. దోనూర్‌కు చెందిన ఆరెకటిక అంజయ్య కుమారుడు శేఖర్ (17) తరచూ మొబైల్ ఫోన్ చూస్తుంటాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు మందలించడంతో ఈ నెల 12న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అతడి కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



నవాబుపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 2003–2004 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 12ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమ గురువులు అనంతప్ప, రేణుక, రాజేశ్వరిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుప్ప రవి, యాదయ్య, శ్రీనివాస్, వెంకటకృష్ణ, రఘువీర్, సురేందర్, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డిపల్లిలో చిరుత కలకలం



కోయిల్‌కొండ ఫింజరి గుట్టపై చిరుతపులి

మహమ్మదాబాద్: మండల పరిధిలోని వెంకట్‌రెడ్డిపల్లి సమీపంలోని అటవీలో చిరుతపులి కనిపించడంతో పరిసర ప్రాంతాల రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నాలుగు రోజుల క్రితం మట్టి కోసం అటవీ ప్రాంతంలోకి వెళ్లిన పలువురు రైతులకు చిరుతపులి కనిపించింది. వాహనం హారన్ మోగించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయం చుట్టుపక్కల గ్రామస్తులకు తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. సమాచారాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలియజేయడంతో అధికారులు చిరుత సంచారాన్ని గమనిస్తున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లే రైతులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కోయిల్‌కొండలో చిరుత సంచారం

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఫింజరిగుట్టపై మంగళవారం చిరుత పులి కనిపించింది. గతంలో కూడా కోయిల్‌కొండ చుట్టు ప్రక్కల గ్రామాలలో పశువులపై దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పక్కనే ఉన్న శ్రీరామకొండపై తరుచూ భక్తులకు చిరుతపులి కనిపిస్తుందని, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

లింగాల: చిరుతపులి దాడిలో లేగ దూడ మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని జీల్గుపల్లి సమీపంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సైదులు లింగాల వెళ్లే మార్గంలో ఉన్న దేవుని గట్టు దగ్గర పశువుల పాకలో పశువులను ఉంచి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూడగా లేగ దూడ మృతిచెందినట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలాన్ని అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాష పరిశీలించి పంచనామా నిర్వహించారు.

చిరుత దాడిలో దూడ మృతి



చిరుత దాడిలో మృతి చెందిన దూడ

మరికల్: చిరుత దాడిలో గేదె దూడ మృతి చెందిన ఘటన మాధవరంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రవి సోమవారం పొలం దగ్గర పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో చిరుత గేదె దూడపై దాడి చేసి చంపేసింది. చిరుత మూడు నెలల నుంచి వరుసగా గేదెలు, ఆవుదూడలపై దాడి చేసి చంపేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారి మల్లేష్‌కు తెలుపగా దూడ చిరుత దాడిలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు.